# రక్షణ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,మే 8:భారత సైన్యం పాకిస్తాన్ ఉగ్రమూకలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనంతర పరిణామాలు, పౌర రక్షణ కార్యకలాపాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈరోజు రాజధాని అమరావతిలో సమీక్ష నిర్వహించారు.

సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులతో పాటు? నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, టూరిజం, ఎండోమెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హెల్త్, ఆర్ అండ్ బీ సహా వివిధ శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, సంసిద్ధతపై సమావేశంలో చర్చించారు. మాక్ డ్రిల్స్ నిర్వహించడం, పరిస్థితి గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం గురించి కూడా సమావేశంలో చర్చించారు. ఊహించని ఘటనలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు.

సముద్ర తీరంలో హై అలెర్ట్..

భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కృష్ణా జిల్లా తీరప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై యుద్ధం జరిగే అవకాశం ఉండటంతో కేంద్రం విశాఖపట్నం, హైదరాబాద్‌లను కేటగిరీ 2లో చేర్చింది. ఈ సమయంలో, తీరప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు.

సముద్ర మార్గం గుండా ఉగ్రవాదులు జిల్లాలోకి రాకుండా బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. జిల్లాలో 110.కి.లో మీటర్ల సముద్ర తీరం ఉండగా.. జిల్లా పరిధిలో 3 మెరైన్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. పాలకాయ తిప్ప(కోడూరు మండలం), గిలకలదిండి(మచిలీపట్నం మండలం), ఒర్లగొందితిప్ప(కృత్తివెన్ను మండలం) మెరైన్ పీఎస్ పరిధిలో 150 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సముద్ర తీర గ్రామంలో మెరైన్ పోలీసులతో పాటు రెండు డ్రోన్ కెమెరాలతో పహారా కాస్తున్నారు. తీర గ్రామాల ప్రజలను సైతం మెరైన్ పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.

# 2,300 మందికి పైగా క్షేత్ర స్థాయి ఎన్నికల అధికారులకు ఐఐఐడీఈఎంలో శిక్షణనిచ్చిన ఈసీఐ

న్యూఢిల్లీ, మే 8:భారతీయ ఎన్నికల సంఘం (ఈసీఐ) మరో అపూర్వ ఘట్టాన్ని ఆవిష్కరించింది...తమిళ నాడు, పుదుచ్చేరిలకు చెందిన క్షేత్ర స్థాయి ఎన్నికల సిబ్బందికి తమిళ భాషలో శిక్షణనిచ్చేందుకు నడుం బిగించింది. ఢిల్లీలోని ఐఐఐడీఈఎంలో ఏర్పాటు చేసిన ఈ మిక్స్‌డ్-బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో 293 మంది పాల్గొన్నారు. వారిలో 264 మంది బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు, 14 మంది ఈఆర్‌ఓలు, ఇద్దరు డీఈఓలతోపాటు ఇతర అధికారులు కూడా ఉన్నారు.

ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) శ్రీ జ్ఞానేశ్ కుమార్ తన ప్రారంభోపన్యాసంలో ఎన్నికలకు సంబంధించిన విధులను నిర్వహించడంలో ఓటర్లకు, ఈసీఐకి మధ్య మొట్టమొదటి సమాచార వారధిగా ఉండేది బీఎల్‌ఓలే అన్నారు. సరైన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడంతోపాటు ఓటర్ల జాబితాలను తాజా స్థితికి తగ్గట్టు సవరించడంలో బీఎల్‌ఓలది కీలక పాత్ర అని ఆయన ప్రధానంగా చెప్పారు. దీనితో కలిపి, గత కొన్ని వారాలుగా ఐఐఐడీఈఎంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సుమారు 2,300 మంది సద్వినియోగ పరచుకొన్నారు. రాబోయే కొన్ని సంవత్సరాల్లో దేశంలో ఒక లక్షమందికి పైగా బీఎల్‌ఓలు సహా అన్ని స్థాయిల ఎన్నికల సిబ్బందికీ విస్తృత శిక్షణనివ్వాలన్న ఉద్దేశానికి అనుగుణంగా ఈ రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఉంది.బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు ఫారం 6, 7, 8లు సహా వేర్వేరు ఫారాలను ఖచ్చితత్వంతో నింపేలా చూడడానికి సంభాషణ ప్రధాన కార్యక్రమాల ద్వారాను, ఇతరత్రా పద్ధతుల్లోనూ శిక్షణనిస్తున్నారు. ఐటీ మాధ్యమం సేవల్ని ఉపయోగించడంలో ఆచరణ పూర్వక శిక్షణను కూడా అందిస్తున్నారు. ఈ బీఎల్‌ఓ సూపర్‌వైజర్లను అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రయినర్లుగా తీర్చిదిద్దుతున్నారు. వీరు ఇతర బీఎల్‌ఓలకు శిక్షణను అందించాల్సి ఉంటుంది.ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 లోని సెక్షన్ 24 (ఎ)లో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం లేదా తత్సమాన శ్రేణికి చెందిన అధికారి) తోపాటు, ఇదే చట్టంలోని సెక్షన్ 24 (బీ)లో భాగంగా రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంత ఎన్నికల ముఖ్య అధికారి (సీఈఓ) ద్వారా ప్రచురణ పూర్తి అయిన తుది ఓటర్ల జాబితాలకు వ్యతిరేకంగా ఒకటో అపీలు, రెండో అపీలుకు సంబంధించిన నిబంధనలపై ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవగాహనను కల్పిస్తున్నారు.

# ఎల్జీ సంస్థ ఏర్పాటుకు నారా లోకేష్ భూమి పూజ




అమరావతి, మే 8: ఏపీ ఆర్థిక చరిత్రలో ఎల్జీ సంస్థ ఏర్పాటు చరిత్రలలో నిలిచిపోయే అంశమని తెలిపారు మంత్రి నారా లోకేష్. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ ఏర్పడనుందని అన్నారు. సత్యవేడు నియోజక వర్గం శ్రీ సిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఏర్పాటుకు ఈరోజు న భూమి పూజ చేశారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కనియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# 80కి పైగా ప్రముఖ భారతీయ టెలికాం, ఐసీటీ సంస్థలు వివిధ విభాగాల్లో వినూత్న ఆవిష్కరణలు, పరిష్కారాల ప్రదర్శన

న్యూఢిల్లీ, మే 8:"భారత్ టెలికాం ఓ సదస్సు మాత్రమే కాదు .. ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు, సమ్మిళిత వృద్ధి ద్వారా అంతర్జాతీయ అనుసంధాన వ్యవస్థ భవిష్యత్తును రూపొందించాలనే భారత్ సంకల్పాన్ని ప్రకటిస్తుంది" అని కమ్యూనికేషన్లు, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో 'భారత్ టెలికాం 2025'ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆలోచనలు, ఆవిష్కరణ, సంకల్పం కలసి పనిచేసినప్పుడు, అవి గందరగోళాన్నికాదు.. అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. ప్రపంచ సహకారం, అవకాశాలకు భారత్ టెలికాం అనుకూలమైనది" అని మంత్రి అన్నారు.

భారత్ టెలికాం 2025ను టెలికమ్యూనికేషన్ల విభాగం (డీవోటీ) సహకారంతో టెలికాం ఎక్విప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (టీఈపీసీ) నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం టెలికాం ఉత్పత్తుల తయారీ, సేవలు, ఎగుమతుల్లో ప్రపంచ కేంద్రంగా ఎదగాలనే భారత్ లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషిస్తుంది. కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, టెలికాం సేవల రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులు, ఆవిష్కర్తల సమక్షంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు 'భారత్ టెలికాం 2025'ను నిర్వహిస్తారు. ఈ రంగానికి చెందినవారికి వేదికను అందించడమే కాకుండా, ప్రత్యేక అంతర్జాతీయ బిజినెస్ ఎక్స్‌పోను సైతం ప్రదర్శిస్తుంది.

ప్రగతిశీల సంస్కరణలు, ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల మద్దతుతో టెలికాం ఎగుమతిదారుగా, ఆవిష్కరణల కేంద్రంగా పెరుగుతున్న భారత్ పాత్ర గురించి తన ప్రారంభోపన్యాసంలో మంత్రి సింధియా వివరించారు. "మేం పల్లెలను మాత్రమే అనుసంధానించడం లేదు.. మేం భవిష్యత్తును అనుసంధానిస్తున్నాం. మేం నిర్మించే ప్రతి టవర్, మేం ప్రసారం చేసే ప్రతి బైట్ 1.4 బిలియన్ల మంది ప్రజలను అవకాశాలకు చేరువ చేస్తుంది'' అని మంత్రి సింధియా అన్నారు. "డిజిటల్ పరమైన అంశాల్లో ఇతర దేశాలను అనుసరించే స్థాయి నుంచి అంతర్జాతీయ డిజిటల్ రంగంలో నాయకత్వం వహించే దేశంగా భారత్ ఎదగడం వెనుక ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ దృఢ సంకల్పం ఉంది. ఈ సంకల్పమే ఆకాంక్షలను మౌలికవసతులుగా, విధానాన్ని అభివృద్ధిగా మార్చింది" అని ఆయన అన్నారు.

"కేవలం 22 నెలల్లో 99 శాతం గ్రామాలను 5జీకి అనుసంధానించాం. 82 శాతం జనాభాను ఈ నెట్వర్క్ పరిధిలోకి తీసుకువచ్చాం. 4,70,000 టవర్లను నిర్మించాం. ఇది పరిణామం కాదు. ఇది టెలికాం విప్లవం" అని ఆయన అన్నారు. ''భారత్ వ్యాప్తంగా నిర్మించిన ఈ డిజిటల్ సదుపాయాలు సమాచార వ్యవస్థకు సంబంధించినవి మాత్రమే కాదు ? మౌలిక వసతులకే మౌలిక సదుపాయాల వంటివి. ఇవి 1.4 బిలియన్ల మంది ప్రజలకు ఆరోగ్య సేవలు, విద్య, పరిపాలన, ఆర్థిక అవకాశాలకు చేరువ చేస్తుంది" అన్నారు.

అంతర్జాతీయ డిజిటల్ శక్తి కేంద్రంగా భారత్ అసాధారణ రీతిలో ఎదుగుతోందని మంత్రి అన్నారు. ఇది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. 4జీ, 5జీ విభాగాల్లో ప్రపంచ వేగాన్ని అధిగమించి భారత్ ముందంజలో ఉందన్నారు. విస్తృత సంస్కరణలు, సాంకేతిక ఆవిష్కరణలు దేశ ప్రగతి పథాన్ని నిర్దేశిస్తున్నాయని తెలిపారు. 1990ల్లో ఖరీదైన, పరిమితమైన మొబైల్ సేవల నుంచి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం మార్కెట్‌గా, చౌకైన డేటా ప్రొవైడర్‌గా మారిన దేశ పరిణామ క్రమంలో టెలికాం రంగం పోషించిన కీలకపాత్రను శ్రీ సింధియా వివరించారు.

ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "ఒక దేశ అభివృద్ధి ప్రయాణంలో అంతర్జాతీయ స్థాయి చర్చల్లో పాల్గొనడం మాత్రమే కాకుండా.. వాటి గమనాన్ని నిర్దేశించే క్షణాలు కూడా ఉంటాయి. ఈ రోజు భారత్ మార్కెట్‌గా లేదా వినియోగదారుగా మాత్రమే తన స్థానాన్ని పరిమితం చేసుకోలేదు. ఆవిష్కర్తగా, భాగస్వామిగా, ప్రపంచస్థాయిలో నమ్మకమైన టెలికాం సేవలు అందించేదిగా నిలిచింది. మేడ్-ఫర్-ఇండియా అనే స్థాయి నుంచి మేడ్-బై-ఇండియా స్థాయికి కథ మారింది" అన్నారు.

ప్రపంచ టెలికాం రంగంలో కీలకమైన మార్పులను భారత్ స్వీకరిస్తోందని, వినియోగదారుడి నుంచి సాంకేతికత రూపశిల్పిగా మారుతోందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. దశాబ్దం క్రితం ప్రారంభించిన డిజిటల్ ఇండియా కార్యక్రమం వల్లే ఈ పురోగతి సాధ్యమైందని తెలిపారు. దీనికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న దూరదృష్టితో కూడిన ప్రభుత్వ విధానాలు సైతం సహకరించాయని పేర్కొన్నారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం, అభివృద్ధి చెందుతున్న స్పెక్ట్రమ్ నిర్వహణ, టెలికాం సాంకేతికతల అభివృద్ధి నిధి తదితర కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. దేశీయంగా తయారీ, ఎగుమతులు, ఆవిష్కరణల్లో పెరుగుదల గురించి వివరించారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ ఇప్పుడు కీలకపాత్ర పోషిస్తోందని, ప్రపంచంలో తయారవుతున్న ఐఫోన్లలో 15 శాతం భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని పేర్కొన్నారు. డిజిటల్ సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయడానికి, 6జీ సేవల్లో ముందంజ, శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ విస్తరణ, క్వాంటమ్ కమ్యూనికేషన్లపై దేశ భవిష్యత్ దృష్టిని వివరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

టీఈపీసీ ఛైర్మన్ శ్రీ అర్నబ్ రాయ్ మాట్లాడుతూ.. "భారత స్వదేశీ టెలికాం వ్యవస్థ పరివర్తనాత్మక శక్తిని, ఈ రంగంలో మనం సాధించిన అసమాన వృద్ధిని, అంతర్జాతీయ టెలికాం పరిశ్రమలో ఆవిష్కరణలను భారత్ టెలికాం కార్యక్రమం ప్రదర్శిస్తుంది" అన్నారు. టెలికాం రంగంలో ఆవిష్కరణలను, తయారీని ప్రోత్సహించిన భారత ప్రభుత్వ వ్యూహాత్మక విధానాలను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే భారత్ టెలికాం ఎగ్జిబిషన్ 2025లో ఆవిష్కరణలను అన్వేషించాల్సిందిగా ప్రతినిధులను కోరారు.

నమ్మకమైన, విశ్వసనీయమైన టెలికాం వస్తువుల తయారీదారుగా, ఎగుమతుల గమ్యస్థానంగా భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ టెలికాం 2025ను రూపొందించారు. టెలికాం పరికరాలు, ఐసీటీ సేవలు, తర్వాతి తరం డిజిటల్ సాంకేతికతల్లో పెరుగుతున్న దేశ సామర్థ్యాలను ఈ కార్యక్రమం ప్రదర్శిస్తుంది. 80కి పైగా ప్రముఖ భారతీయ టెలికాం, ఐసీటీ సంస్థలు వివిధ విభాగాల్లో వినూత్న ఆవిష్కరణలు, పరిష్కారాలను ప్రదర్శించాయి.

ఈ కార్యక్రమంలో 35కి పైగా దేశాలకు చెందిన ప్రభుత్వ విభాగాలు, ప్రైవేటు సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తూ 130 మంది విదేశీ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 5జీ, ఆప్టికల్ ఫైబర్, బ్రాండ్‌బ్యాండ్ వసతులు, శాటిలైట్ కమ్యూనికేషన్, ఐవోటీ, ఏఐ-ఆధారిత వ్యవస్థలు తదితర అత్యాధునిక సాంకేతికతలపై ఎగ్జిబిషన్లు, కాన్ఫరెన్సులు, అత్యంత ప్రభావవంతమైన బీ2బీ సమావేశాలు, వ్యూహాత్మక నెట్వర్కింగ్ కార్యక్రమాలు, నాలెడ్జి షేరింగ్ ఫోరమ్‌లు ఏర్పాటు చేశారు.

భారత ప్రభుత్వ విదేశీ వాణిజ్య విధానం ప్రకారం 2009లో టెలికాం ఎక్విప్‌మెంట్ అండ్ సర్వీసెస్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (టీఈపీసీ) ఏర్పాటయింది. టెలికాం వస్తువులు, సేవల ఎగుమతులను ప్రోత్సహించడంలో, సులభతరతరం చేయడంలో ఈ సంస్థ కీలకపాత్ర పోషిస్తుంది. ఐసీటీ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, మౌలికవసతులను మెరుగుపరిచే ఉత్పత్తులు, వ్యవస్థల ఏకీకరణ, కన్సల్టెన్సీ, సేవా సదుపాయాలతో సహా మొత్తం టెలికాం వ్యవస్థకు ఆదేశాలు జారీ చేస్తుంది. పరికరాల తయారీదారులు, సిస్టమ్ ఇంటిగ్రేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, టెలికాం రంగంలోని ఇతర సంస్థలకు టీఈపీసీ కీలకమైన వేదికగా పనిచేస్తుంది.

# ఎసెహెచ్ఓగా భాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లు



ఖమ్మం, మే 8 (నేటినిజం ప్రతినిధి) :ఇటీవల జారీ చేసిన ఇన్స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల నేపథ్యంలో గురువారం ఎస్ హెచ్ వో లు ఖమ్మం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ టి. కరుణాకర్, ఖమ్మం త్రీటౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ గా డి.రమేష్ భాధ్యతలు స్వీకరించారు.

భాధ్యతలు స్వీకరించిన ఆనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని పోలీస్ కమిషనర్ కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా భాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు.

# సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జోక్యంతో పిప్రాహ్వా బౌద్ధ స్మారక చిహ్నాల వేలం వాయిదా వేసిన సోథ్బీ హాంకాంగ్ సంస్థ

న్యూఢిల్లీ, మే 8:ఈరోజు నిర్వహించాల్సిన పవిత్రమైన పిప్రాహ్వా బౌద్ధ స్మారక చిహ్నాల వేలాన్ని భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జోక్యంతో సోథ్బీ హాంగ్ కాంగ్ సంస్థ వాయిదా వేసింది.

1898లో విలియం క్లాక్స్టన్ పెప్పే పిప్రాహ్వాలో నిర్వహించిన తవ్వకాల్లో సోప్‌స్టోన్, స్ఫటికంతో చేసిన పేటికలు, ఇసుకరాయి పెట్టెతో పాటు బుద్ధుని ఎముకల భాగాలు, విలువైన బంగారు ఆభరణాలు, రత్నాల వంటి చారిత్రక అవశేషాలు లభించాయి. ఈ పేటికల్లో ఒకదానిపై బ్రాహ్మి లిపిలో ఉన్న శాసనం ద్వారా వీటిని బుద్ధుని అవశేషాలుగా నిర్ధారించారు. వీటిని శాక్య వంశం వారు నిక్షిప్తం చేశారు. ఈ అవశేషాల్లో ఎక్కువ భాగం 1899లో కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియంకు తరలించారు. భారతీయ చట్టం ప్రకారం 'ఏఏ' పురాతన వస్తువులుగా వీటిని వర్గీకరిస్తూ, వీటిని తొలగించడం లేదా అమ్మడంపై నిషేధం విధించారు. బుద్ధుని పవిత్ర ఎముక అవశేషాల్లో కొంత భాగాన్ని డబ్ల్యు.సి. పెప్పే సియామ్ రాజుకు బహుమతిగా ఇచ్చారు. బుద్ధుని అంత్యక్రియల సమయంలో ఉపయోగించిన రత్నాలు పెప్పే మునిమనవని సంరక్షణలో ఉండగా వాటిని కూడా వేలానికి ఉంచారు.

మీడియా నివేదికల ద్వారా వేలం గురించి తెలుసుకున్న సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వెంటనే కింది చర్యలను ప్రారంభించింది:

వేలాన్ని వెంటనే నిలిపివేయాలని అభ్యర్థిస్తూ భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) డైరెక్టర్ జనరల్ ఈనెల 2వ తేదీన హాంకాంగ్ కాన్సులేట్ జనరల్‌కు లేఖ రాశారు.

అదే రోజు జరిగిన ద్వైపాక్షిక సమావేశంలో, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ విషయాన్ని గురించి యూకే సాంస్కృతిక, మీడియా, క్రీడల మంత్రి గౌరవనీయ లిసా నాండీతో చర్చించి, ఆ పవిత్ర స్మారక చిహ్నాల సాంస్కృతిక, మతపరమైన ప్రాముఖ్యత దృష్ట్యా వేలం వాయిదాకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

తదనంతర చర్యలను గురించి చర్చించడం కోసం ఈనెల 5వ తేదీన సాంస్కృతిక శాఖ కార్యదర్శి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

అదే రోజున సోథ్బీకి (ప్రతినిధులైన శ్రీమతి ఐవీ వాంగ్, జూలియన్ కింగ్ ద్వారా), క్రిస్ పెప్పేకు వేలం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసు జారీ అయింది.

వేలం నిలిపివేశారని నిర్ధారించుకోవడానికి దాని యూరప్ పశ్చిమ, తూర్పు ఆసియా విభాగాలు, యూకే అలాగే హాంకాంగ్‌లోని రాయబార కార్యాలయాల ద్వారా సమాచారాన్ని తెలుసుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు

ఈ నెల 5వ తేదీన లీగల్ నోటీసును అందుకున్నట్లు ఈమెయిల్ ద్వారా ప్రకటించిన సోథ్బీ హాంకాంగ్, ఈ విషయం పరిశీలనలో ఉందనీ, రాతపూర్వక సమాధానం సమర్పిస్తామని హామీ ఇచ్చింది.

జాయింట్ సెక్రటరీ (తూర్పు ఆసియా విభాగం, ఎమ్ఈఏ), హాంకాంగ్‌లోని భారత కాన్సుల్ జనరల్‌తో సహా సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ నెల 6న సోథ్బీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ స్మారక చిహ్నాలు సాధారణ కళాఖండాలు కాదనీ, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది బౌద్ధులకు అత్యంత పవిత్రమైనవని ప్రతినిధి బృందం స్పష్టం చేసింది. ఈ స్మారక చిహ్నాలు పూర్తిగా భారత్‌కు చెందినవేనని, అయితే వీటిని వలస రాజ్యాల కాలంలో పలు ప్రాంతాలకు తరలించారని ప్రతినిధి బృందం వారికి స్పష్టంగా వివరించింది.

పిప్రాహ్వా స్మారక చిహ్నాల వేలాన్ని వాయిదావేస్తున్నట్లు 6వ తేదీన ఆలస్యంగా ఈమెయిల్ ద్వారా ప్రకటించిన సోథ్బీ హాంకాంగ్ సంస్థ ఈ విషయంగా మరింత చర్చ జరగాలని ప్రతిపాదించింది. అనంతరం సోథ్బీ వెబ్‌సైట్ నుంచి వేలానికి సంబంధించిన పేజీని తొలగించింది. యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి క్రిస్టా పిక్కట్, యునెస్కో డైరెక్టర్, భారత్, శ్రీలంక, ఇతర దేశాల బౌద్ధ సంస్థల ప్రతినిధి ప్రొఫెసర్ నమన్ అహుజాలు ఈ విషయంగా మంత్రిత్వ శాఖ ప్రయత్నాలకు పూర్తి మద్దతునిచ్చారు, అలాగే ప్రధానమంత్రి పోర్టల్, జాతీయ, అంతర్జాతీయ మీడియాకు ఈ విషయంగా వారు అధికారిక నివేదికను సమర్పించారు.ఏఎస్ఐ, ఎమ్ఈఏల సహకారంతో, ఆ పవిత్ర స్మారక చిహ్నాలను తిరిగి భారత్‌కు అప్పగించే విషయంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంబంధిత వ్యక్తులందరినీ దీనిలో భాగస్వామ్యం చేయనుంది.

# ఉపముఖ్యమంత్రిని సన్మానించిన వేల్పుల మురళి



ఖమ్మం, మే 8 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని గురువారం ఖమ్మం కలెక్టరేట్లో దళితరత్న అవార్డు గ్రహీత, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి సన్మానించారు.

రాష్ట్రంలో అభివృద్ధి పదములో నడిపిస్తున్న జిల్లాను సస్యశ్యామలం చేయుటంలో ముందుంటున్నారని అలాగే ఖమ్మంలో ప్రభుత్వ వైద్య కళాశాలకు శంకుస్థాపన చేయటంలో కీలక పాత్ర పోషించిన వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆశీస్సులతో, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చోరవతో జిల్లాను అభివృద్ధి పదంలో నడిపించడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా పోలీస్ అధికారులకు, జిల్లా యంత్రాంగానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. సన్మానించిన వారిలో ఆత్మ కమిటీ డైరెక్టర్ ప్రకాష్ రావు, సొసైటీ డైరెక్టర్ రత్నరాజు, ఇనుకల సురేష్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పెళ్లి రోజు వేళ....సుప్రభాత సేవ...

## - శ్రీ సీతారామ చంద్ర స్వామిని దర్శించుకున్న పొంగులేటి దంపతులు



భద్రాద్రి కొత్తగూడెం మే 8 (నేటినిజం ప్రతినిధి) : తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి-మాధురి దంపతులు భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామిని గురువారం దర్శించుకున్నారు. పెళ్లిరోజు సందర్భంగా ఆలయంలో స్వామివారి సుప్రభాత సేవకు హాజరయ్యారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చి గోత్ర నామాలతో పూజలు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి దంపతులు ఐటీసీ గెస్ట్ హౌస్ లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పోతిరెడ్డి వేంకటేశ్వర రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదు

కర్నూల్ మే 8 : కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2017 మే 21న కృష్ణగిరి మండలంలో వైఎస్సార్సీపీ నేత చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదుతో పాటు వెయ్యి చొప్పున జరిమానా విధించింది. ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో 29 మంది సాక్షులను కోర్టు విచారించింది.

2017 మే 21న కృష్ణగిరి మండలంలో నారాయణ రెడ్డి హత్య జరిగింది. ఈ కేసులో 29 మంది సాక్షులను విచారించిన న్యాయస్థానం ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. వాస్తవంగా ఈకేసులో మొత్తం 19మంది నిందితులు కాగా. ఇందులో ఐదు మందిపై నేరం రుజువు కాలేదు

. ఇక కేసులో నిందితులుగా పేర్కొన్న, ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ. శ్యాంబాబు, దేవనకొండకు చెందిన కప్పట్రాళ్ల బుజ్జమ్మ పేర్లను గతంలోనే.. న్యాయస్థానం ఆదేశాల మేరకు తొలగించగా, ఇక ఈ కేసులో నాలుగో నిందితుడిగా ఉన్న వ్యక్తి.. ఇటీవలనే అనారోగ్యంతో మరణించారు.

మొత్తంగా చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసులో 11మందికి జీవిత ఖైదు పడడం జిల్లాలో సంచలనంగా మారింది. ఫ్యాక్షన్ కిల్లాగా పేరొందిన కర్నూలు జిల్లాలో ఇలాంటి తీర్పులు.. ముద్దాయిలకు ముచ్చెమటలు పట్టించనున్నాయి. తీర్పు నేపథ్యంలో కర్నూలు జిల్లా కోర్టు వద్ద విషాదం అలుముకుంది. శిక్ష పడిన వ్యక్తులను తక్షణమే పోలీసులు సబ్ జైలుకు తరలించే ప్రయత్నంలో ఉండడంతో.. శిక్ష పడిన ఖైదీల బంధువుల రోదనలు మిన్నంటాయి.

# మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి కన్నుమూత.. తలసాని సంతాపం



హైదరాబాద్, మే 8: మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సోదరుడు మాజీ ఎమ్మెల్యే బండారు రాజిరెడ్డి గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. వయసు రీత్యా అనారోగ్య సమస్యలతో రాజిరెడ్డి తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం కోసం రాజిరెడ్డి పార్థివ దేహాన్ని హబ్సిగూడలోని ఆయన నివాసంలో ఉంచారు.

రాజిరెడ్డి మృతికి మాజీ మంత్రి తలసాని సంతాపం..

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి మృతికి మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. ఇవాళ ఉదయం మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి మరణించడంతో హబ్సిగూడలోని నివాసానికి వెళ్లి రాజిరెడ్డి పార్థీవ దేహంపై తలసాని శ్రీనివాస్ యాదవ్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

# కాచిగూడలో బంగారం షాపులో చోరీ.. ముగ్గురు అరెస్ట్

హైదరాబాద్, మే 8: అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బంగారం దుకాణంలో చోరీకి పాల్పడిన ముగ్గురుని పోలీసులు అరెస్టు చేశారు. డీఐ హాఫీజ్ ఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ మొఘల్‌పురాకు చెందిన సయ్యద్ ఆరిఫ్ ఉద్దీన్ (40), షేక్ అహ్మద్ ఉద్దీన్(45), నసీమా బేగం(40), కయాం సుల్తానా(70) కలిసి ఈ నెల 5న అంబర్‌పేట తిరుమలనగర్‌లోని భవన్ లాల్ బంగారం షాపునకు వెళ్లారు. అధిక బరువు గల బంగారు గాజులు చూపించాలని కోరారు. ఒక ట్రేలో బంగారు గాజులు చూపిస్తుండగా షాపు యజమాని దృష్టి మళ్లించి రూ. 2 లక్షల విలువగల బంగారు గాజులు దొంగతనం చేసి దానికి బదులుగా రోల్డ్ గోల్డ్ బంగారు గాజులను అక్కడ ఉంచి ఉడాయించారు. ఇది గమనించిన యజమాని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలించారు. దొంగతనానికి పాల్పడ్డ నిందుతుల్లో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసి, చోరీకి గురైన బంగారు గాజులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

# ఓల్డ్ బోయిన్‌పల్లిలో నూతన మహీంద్రా షోరూం ప్రారంభం



హైదరాబాద్, మే 8:ప్రముఖ కార్ డీలర్ వీవీసీ మోటార్స్ హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో నూతన మహీంద్రా షోరూమ్‌ను ప్రారంభించింది. దాదాపు 6500 చదరపు అడుగల విస్తీర్ణంతో అతి విశాలమైన ఈ షోరూమ్‌ను వీవీసీ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ వీవీ రాజేంద్రప్రసాద్, వీవీసీ మహీంద్రా షోరూమ్ సీఈవో వీరేన్ చౌదరి ప్రారంభించారు. అలాగే ఎల్బీనగం లోని జిల్లెల్లగూడలో అతి పెద్ద సర్వీస్ సెంటర్‌ను ఓపెన్ చేశారు.

ఈ సందర్భంగా వీవీ రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. ఓల్డ్‌బోయిన్‌పల్లిలో అత్యంత విశాలమైన షోరూమ్, జిల్లెల్లగూడలో అధునాతన సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ షోరూమ్ గ్రాండ్ లాంచ్ కూడా ఈ నెలలోనే ఉంటుందని తెలిపారు. ఇక్కడి బాడీ షాప్‌లో ఒకే సమయంలో 18 కార్లను సర్వీస్ చేసి ఇవ్వగలమని పేర్కొన్నారు. ఇప్పటికే, తమకు హైదరాబాద్‌లోని కొత్తగూడ, హైటెక్ సిటీ, ఈసీఐఎల్, కూకట్‌పల్లిలో అత్యాధునిక సెర్వీస్ సెంటర్స్ ఉన్నాయని ఇప్పుడు కొత్తగా ఎల్బీ నగర్‌లోని జిల్లెలగూడలో కూడా స్టార్ట్ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. బాచుపల్లిలో కూడా సెర్వీస్ సెంటర్ ఉందని తెలిపారు.

కొత్తగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, శంషాబాద్, అత్తాపూర్, ఘట్‌కేసర్, నాచారం, ఈసీఐఎల్, ఎల్‌బీనగర్, మలక్‌పేట్, హిమాయత్ నగర్, సనత్ నగర్, కొంపల్లి, బాచుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లిలో తమకు షోరూమ్స్ ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఓల్డ్ బోయిన్ పల్లిలో కొత్త షోరూమ్‌ని ప్రారంభించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా థార్ కార్‌ను ఫస్ట్ డెలివరీ ఇచ్చారు.

# ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ మిలిటరీ కేంద్రాలను టార్గెట్ చేయలేదు

న్యూఢిల్లీ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి భారత సర్కారు మీడియాకు వెల్లడించింది. ఆ మీడియా సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రితో పాటు ఇద్దరు మహిళా ఆఫీసర్లు పాల్గొన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో పాటు కల్నల్ సోఫియా ఖురేషి ఆ ఆపరేషన్ గురించి వివరించారు. ఇద్దరు మహిళా ఆఫీసర్లతో మీడియా సమావేశాన్ని నిర్వహించి మహిళా శక్తిని ఇండియా చాటింది. ఆపరేషన్‌కు సిందూర్ అని పేరు పెట్టడంలో నిగూఢ అర్థం దాగి ఉన్నది. పెహల్గామ్ ఉగ్రదాడిలో భర్తలు కోల్పోయిన మహిళలు తమ సిందూరాన్ని కోల్పోయారు. ఆ మహిళలను గౌరవిస్తున్న రీతిలో సిందూర్ అనే పేరు పెట్టారు. విశ్వసనీయమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశామని, ఆ ఉగ్రవాదులు సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడ్డారని, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ మిలిటరీ కేంద్రాలను టార్గెట్ చేయలేదని కల్నల్ సోఫియా ఖురేషి వెల్లడించారు. మొత్తం 9 ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. ప్రతిదాడి అంశంలో భారత్ నిగ్రహాన్ని ప్రదర్శించిందని, పాకిస్థాన్ కవ్వింపు చర్యలను ధీటుగా ఎదుర్కొనేందుకు సమాయత్తం అయి ఉన్నామని తెలిపారు. వింగ్ కమాండ్ వ్యోమికా సింగ్.. భారతీయ వైమానిక దళంలో హెలికాప్టర్ పైలెట్. నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌లో ఆమె చేశారు. ఇంజినీరింగ్ చదివారు. 2019, డిసెంబర్ 18వ తేదీన ఫ్లయింగ్ బ్రాంచ్‌లో పర్మనెంట్ కమిషన్‌లో చేరారు. కల్నల్ సోఫియా ఖురేషి.. ఇండియన్ ఆర్మీ కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌లో ఉన్నత అధికారి. భారతీయ సైన్యంలో ఓ ఆర్మీ కాంటింజెంట్‌కు నాయకత్వం వహిస్తున్న తొలి మహిళా ఆఫీసర్‌గా ఉన్నారు.

# కరాటే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



హైదరాబాద్, మే 8: ప్రాచీన యుద్ధ విద్య అయిన కరాటే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అన్నారు. డివిజన్ పరిధి లోని చైతన్యనగర్ డబుల్ బెడ్‌రూం డిగ్నిటీ కాలనీలో భవాని షోటోకాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రాండ్‌మాస్టర్ వృద్వీకు మార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ తరగతులను బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్షల్ కళలో కరాటే ఒకటని, ప్రతి విద్యార్థి, విద్యార్థులు కరాటేను నేర్చుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కార్పొరేటర్ ప్రభుదాస్, శ్రీనివాస్‌రెడ్డిలను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు డీసీఎం.రాజు, కాలనీ నాయకులు బొడ నరేశ్, రమేశ్, విద్యసాగర్, సీతమహలక్ష్మి, పాల్‌రాజు, మహేశ్, ప్రభాకర్, చందు, కుమార్, లక్ష్మి, భారతి, మూర్తి, వెంకటేశ్‌లతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం

హైదరాబాద్, మే8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై అనవసర వ్యాఖ్యలతో కేటీఆర్ తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. గత ప్రభుత్వం కొన్ని వర్గాలకే కొమ్ముకాసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. కేసీఆర్ అప్పు.. తెలంగాణ భవిష్యత్తుకు ముప్పుగా దాపురించిందన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు 6 వేల కోట్ల ప్రజాధనాన్ని అప్పుల చెల్లింపుల కోసం మళ్లించాల్సి వస్తోందని తెలిపారు. సత్తా ఉన్న నాయకుడు కేసీఆర్ అయితే.. పత్తా లేకుండా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. సత్తా ఉంటే అసెంబ్లీకి వచ్చి సత్తా నిరూపించుకోవాలని హితవు పలికారు. ఉద్యోగుల పోరాటాన్ని వాడుకున్న చరిత్ర బీఆర్ఎస్ ది అంటూ ఫైర్ అయ్యారు. 40 మంది ఆర్టీసీ కార్మికుల ఉసురు తీసింది మీరు కాదా.. అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకుల ఇంటి తలుపులు పగుల గొట్టింది ఎవరు కేటీఆర్ అని నిలదీశారు. ఎందరో ఉద్యమకారులను అవమానపరిచి బయటకు పంపిన చరిత్ర గులాబీ పార్టీ ది అంటూ మండిపడ్డారు. అప్పులు, అమ్మకాలు తప్ప బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఒక గాలి బుడగ అని ఎన్నికల్లో ప్రజలే తేల్చారన్నారు. బీఆర్ఎస్ అప్పుల మూలంగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అయినా ఎక్కడా సంక్షేమానికి లోటు లేకుండా చూస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# రామకృష్ణ సేవా మందిరంలో విజయవంతంగా ముగిసిన బాల సంస్కార్ -2025

-వేసవి సెలవుల్లో బాలబాలికలకు వ్యక్తిత్వ-వికాస శిబిరం నిర్వహణ

-భవిష్యత్ తరాలకు భారతీయ సంస్కృతీ-సంప్రదాయాలు తెలియజేయడమే ఈ శిబిరం ధ్యేయం

- సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి



హనుమకొండ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హనుమకొండ శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గతనెల 28 నుండి నేటి వరకు వేసవి సెలవుల్లో నిర్వహించబడిన 10 రోజుల బాల సంస్కార్-2025 వేసవి శిబిరం జయప్రదమైందని సేవా సమితి అధ్యక్షులు కటంగూరి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. . ప్రతి రోజు ప్రార్థన, యోగాసనాలు, ధ్యానం తర్వాత అల్పాహారం కొరకు స్వల్ప విరామం ఇవ్వబడి భజన, శ్లోకాల పఠనం మరియు నైతిక విలువల అంశాలపై నిపుణులతో అవగాహన కల్పించామన్నారు. మాతృ-పితృ భక్తి గురించి లక్ష్మణ సుధాకర్, గురు శిష్య సంబంధంపై చక్రవర్తుల సుధాకర్, ఏకాగ్రత రహస్యంపై ఎం. తిరుపతి రెడ్డి, దేశభక్తి గురించి సౌమిత్రీ లక్ష్మణా చారి, వైద్య ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ చర్యల గురించి వైద్య నిపుణులు డా?శివ సుబ్రహ్మణ్యం మరియు డా? సౌమ్య వివరించారని, సంస్కృతం పేట శ్రీనివాస్, క్రాఫ్ట్ యుగంధర్, కోలాటం రాజేష్, దండ శివప్రసాద్ శిక్షణలు అద్భుతం. 5వ రోజు కాకతీయ ప్రాశస్త్యం కల్గిన గోవిందరాజుల గుట్ట, మెట్ల బావి, ఐనవోలు పుణ్య క్షేత్రాల చరిత్ర మరియు మామునూరు పోలీసు క్యాంపు సందర్శనలు వగైరా నిత్యకృత్యాల నిర్వహణలో సేవా సమితి బాధ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శ్రీనివాస స్వామి, కే.వి.రావు, సూర్య, అనిల్, రాధిక, స్వరూప, అనిత, శిల్ప, అంజనీ దేవి, కృష్ణవేణి, శ్వేత, సరోజనమ్మ, సునీత, పార్వతి, లక్ష్మీరావు సేవలు ప్రశంసనీయం. కోలాటం శిక్షణా కోచ్ రాజేష్, దాండియా కోచ్ శివప్రసాద్, క్రాఫ్ట్ మాస్టర్ యుగంధర్ ల యొక్క శిక్షణ అద్భుతం. నేడు తల్లి దండ్రుల పాదపూజ కార్యక్రమాన్ని డా? రామకృష్ణ గురూజీ శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. వరంగల్ రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజగోపాల్, కార్యదర్శి గంటా వేణుకుమార్, ప్రతినిధులు శ్రీమతి విజయగోపాల్, సుధాకర్ వరంగల్ శారద హై స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ 6 వేల రూపాయల విలువైన ఆధ్యాత్మిక సాహిత్యం పుస్తకాలను బాల-బాలికలిందరికీ బహూకరించారు. ఈ శిబిరంవల్ల పిల్లలకు-పేరెంట్సుకు దివ్యమైన అనుభూతిని, సంతుష్టిని కల్గించాయన్నారు.

# జనాభా గణనలో కులగణ నిర్ణయం చారిత్రాత్మకం

-రౌండ్ టేబుల్ సమావేశంలో హర్షం వ్యక్తం చేసినా 96 బీసీ కుల సంఘాల నేతలు

-తెలంగాణ కులసర్వే నమూనాను అనుసరిస్తే కొంప మునిగినట్లే అవుతుంది" ? ఆర్. కృష్ణయ్య

-"కేంద్ర ప్రభుత్వం కులగణన ముందుకు తేవడం శుభపరిణామం"

- శాసన మండలిలో విపక్ష నాయకుడు సిరికొండ మధుసూధనాచారి



హదరాబాద్ మే 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన 96 బీసీ సంఘాల ప్రతినిధులు, బీసీ మేధావులు, సామాజికవేత్తలు బుదవారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. కులగణనపై తగు సూచనలతో కూడిన నివేదికను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి సమర్పించేందుకు త్వరలో బీసీ ప్రతినిధుల బృందం న్యూఢిల్లీకి వెళ్లనుంది. హైదరాబాద్ లక్కడికపూల్ హోటల్ అశోకలో జరిగిన సమావేశానికి తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అధ్యక్షత వహించారు. రాజ్యసభ సభ్యుడు మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంవత్సరాలుగా కొనసాగించిన పోరాటానికి కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం. కులగణన సక్రమంగా జరిగితే శాస్త్రీయ ప్రణాళికలతో సంక్షేమ పథకాలను రూపొందించుకోవచ్చు. జనాభా ప్రకారం రిజర్వేషన్ల శాతాలను పెంచుకునే అవకాశం ఉంటుంది .కులాల జాబితాలను శాస్త్రీయంగా పునర్వర్గీకరించి రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేయాలి. ఈ గణాంకాలు న్యాయస్థానాల్లో రిజర్వేషన్లను సమర్థించేందుకు ఆధారాలు అందిస్తాయి. తెలంగాణ ప్రభుత్వం గతంలో అనేక తప్పులు చేసింది. అయినా, ఇప్పుడు జాతీయ కులగణనకు తెలంగాణ నమూనాను అనుసరించాలని సూచించడం ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన విషయం. తెలంగాణ నమూనా అనుసరిస్తే కొంప మునిగినట్లే అవుతుంది. బీసీ మేధావులు, సామాజికవేత్తలు ప్రాథమిక సూచనలతో నివేదిక సిద్ధం చేయాలి. స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు తక్షణమే ప్రారంభించాలి. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో చర్చలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు. జాతీయ స్థాయిలో ఓబీసీ నాయకుల జాబితా తయారవుతోంది. పూర్తయిన తర్వాత ప్రధానిని కలవనున్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ మేధావుల ఫోరం ఛైర్మన్ చిరంజీవులు, సిరికొండ మధుసూధనాచారి, పాలూరు రామకృష్ణయ్య, , ఈశ్వరప్ప, ఆనంద్ గౌడ్ , నీల వెంకటేష్, మల్లేశ్ వంశరాజ్, రమాదవి, ఏ . లతా, ప్రొఫెసర్ సుధర్షన్ భూమన్న యాదవ్, రామకోటి, మంద రాజమల్లు, తదితరులు.

# ఆపరేషన్ సిందూర్ ను చేపట్టిన భారత ఆర్మీని చూసి గర్విస్తున్నాం: కాంగ్రెస్

న్యూ ఢిల్లీ మే 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆపరేషన్ సిందూర్ ను చేపట్టిన భారత ఆర్మీని చూసి గర్విస్తున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. పాక్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రస్థావరాలపై భారత బలగాల దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సచిన్ పైలట్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఉగ్ర స్థావరాలపై ఉక్కుపాదం మోపిన భారత సాయుధ దళాలను చూసి గర్విస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. ఇక, ఆపరేషన్ సిందూర్ పై ఖర్గే మాట్లాడుతూ.. దేశ రక్షణ విషయంలో సైనికులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ కాంగ్రెస్ మద్దతు ఉంటుందని తెలిపారు. దేశ రక్షణ కోసం మనమంతా ఐక్యంగా ఉండాలని ఖర్గే అన్నారు. కాగా, భారత సాయుధ దళాలు.. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని బహావల్‌పూర్‌లోని జైష్-ఎ-మొహమ్మద్ ప్రధాన స్థావరంతోపాటు మురిడ్కేలోని లష్కరే-ఎ-తోయిబా వంటి తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మిస్సైల్స్ తో విరుచుకుపడ్డాయి. భారత సైనికుల దాడుల్లో భారీగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం.

# ఒకే రోజు మూడు గ్రామాల్లో టాస్కా అవగాహన కార్యక్రమం



యాదగిరిగుట్ట మే 78 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మండలంలోని బాహుపేట, కుమ్మరి గూడెం, యాసోజీ గూడెం మూడు గ్రామాల్లో మండల టాస్కా (తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ ఈ అసోసియేషన్) అధ్యక్షుడు ముదుంబై జయమోహనా చార్య, కార్యదర్శి పులుగం చక్రపాణి సారథ్యంలో ఫ్లెక్సీల ఆవిష్కరణ, పోస్టర్ లను అతికించడం వంటి కార్యక్రమాలను చేపట్టి వయోజనుల్లో అవగాహన కల్పించారు.

నూకల సుధాకర్ రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్, చంద్రయ్యగౌడ్, వెలిశాల బ్రహ్మచారి తదితర టాస్కా సభ్యులు పాల్గొన్న ప్రచార కార్యక్రమాలు వృద్ధుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ప్రయోజనాలపై చైతన్యం కలిగించాయి.

**8బాహుపేటలో.....**

8బాహుపేట గ్రామంలో స్థానిక వయోజనులు ఆరె బాల నర్సయ్య, కొరటి కంటి పోశెట్టి, కొండె లక్ష్మయ్య, పుల్లవేణి ఆంజనేయులు, ఎస్ డి సలీం, కె భాస్కరాచారి, శివరాత్రి చంద్రయ్య, గుడ్ల భారతమ్మ, బోలపల్లి ఎల్లయ్య గౌడ్, ఎం డి గులాంరసూల్, కొండె ఐలయ్య, బీరు మల్లయ్య తదితరులు టాస్కా కృషి పై ఆనందం వ్యక్తం చేశారు.

**8కుమ్మరి గూడెం లో...**

8కుమ్మరి గూడెం లోనూ అదే చైతన్యం కనిపించింది. సుడుగు బాల్ రెడ్డి, సుడుగు లక్ష్మీ, నర్సమ్మ, కమలమ్మ, పారెల్లి ఈరమ్మ, సత్తయ్య తదితర వయోజనులు నిస్వార్థంగా టాస్కా చేస్తున్న కృషిని అభినందించారు

8యాసోజుగూడెం లో స్పందన....

8టాస్కా అవగాహన కార్యక్రమాలపై యాసోజు గూడెం వయోజనుల్లో మంచి స్పందన కలిగించింది. పడకంటి రామనాథం చారి, నాలోజీ కృష్ణమాచారి, మరబోయినే సిద్ధులు, గొల్లపల్లి సంజీవ, బర్ల లక్ష్మయ్య, ఎం డి జహంగీర్, ఎం డి చోటా మియా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదుంబై జయమోహనాచార్య మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేస్తున్న సీనియర్ సిటిజన్స్ కార్డులను ప్రతి ఒక్కరు తీసుకోవాలని, ప్రజలను పొందాలని, శేష జీవితంలో ఆనందంగా గడపాలని సూచించారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడిన విద్యుత్ ఏఈ

**ట్రాన్స్‌ఫార్మర్ లైన్‌చేంజ్ కోసం రూ.50 వేలు డిమాండ్ .**

**రూ.10 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**

హైదరాబాద్, మే 8: కాంట్రాక్టర్ వద్ద లంచంతీసుకుంటూ ప్రగతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ జ్ఞానేశ్వర్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్(ఎలీఫ్) సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఆపరేషన్)గా పనిచేస్తున్న జ్ఞానేశ్వర్.. తన పరిధిలోని మిథిలానగర్‌లో ఓ బిల్డింగ్ ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేవీ లైన్ మార్చేందుకు నెల రోజుల క్రితం కాంట్రాక్టర్ నుంచి రూ.50 వేలు లంచం డిమాండ్ చేయగా రూ.30వేలకు బేరం కుదిరింది.

ఆ తర్వాత రూ.15 వేలు తీసుకునేందుకు ఒప్పుకున్న జ్ఞానేశ్వర్ బుధవారం మధ్యాహ్నం తన కార్యాలయంలోనే రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పక్కా సమాచారంతో అప్పటికే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడుల్లో రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో 4 గంటలపాటు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లోని ఏఈ కార్యాలయం, నగరంలో ఆర్‌టీసీ క్రాస్‌రోడ్డులోని ఏఈ ఇంట్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా కార్యాలయం సమీపంలోని కారులోను తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

# రైతులు వాణిజ్య పంటల సాగుపై దృష్టిని సారించాలి : ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నర్సింగరావు



మహబూబ్‌నగర్, మే 8: రైతులు ఒకరికి చేయి చాచే విధంగా కాకుండా చేతితో ఒకరికి ఇచ్చే విధంగా రైతులు, రైతు కూలీలు ఆర్థికంగా ఎదగాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నరసింగరావు ఆకాంక్షించారు. మండలంలోని ఆరగిద్ద శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులను మొక్కుబడిగా కాకుండా నిర్ణీత కొలతల్లో చేస్తే ఆశించిన స్థాయిలో కూలీ డబ్బులు అందుతాయని స్పష్టం చేశారు. మూస పంటలకు స్వస్తి చెప్పి వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. తద్వారా పెట్టుబడితో పాటు కాయకష్టం తగ్గి, రైతులు లాభాల బాటలో పయనించవచ్చని సూచించారు. ఉపాధి హామీ పథకంలో రకరకాల పనులు ఉన్నాయని, అవసరమయ్యే వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . అదనపు కలెక్టర్ మోటార్ సైకిల్‌పై పంట పొలాలలో కలియ తిరుగుతూ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్యను మరింత పెంచాల ని కోరారు. కూలి డబ్బులు నిర్ణీత సమయంలో అందే విధంగా చూడా లన్నారు. ఉపాధి సిబ్బంది పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్యం పై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. ఆరగిద్దలో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని హౌసింగ్ పీడీ కాశీనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఏపీవో స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

